క్లుప్తంగా

శరవేగంగా కమ్యూనిటీ హాలు నిర్మాణం



నిర్మాణంలో కమ్యూనిటీ హాలు

మాడుగుల రూరల్: కె.జె.పురం మేజర్ పంచాయతీ శివారు తెలకలదీపం గ్రామంలో కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన విజ్ఞప్తి మేరకు ఇక్కడ శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ హాలు స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు రూ.5 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో ప్రస్తుతం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. అదేవిధంగా జల జీవన్ మిషన్‌లో భాగంగా రూ.30 లక్షలతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ సదుపాయం కల్పించారని సర్పంచ్ జామి రమణబాబు తెలిపారు.

ఉత్తర వాహిని ఘాట్లో పూడిక తొలగింపు



యంత్రాలతో పూడిక తీయిస్తున్న వైస్ చైర్మన్ రామకృష్ణ, అధికారులు

నర్సీపట్నం: కార్తీక మాసంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ పాలకవర్గం దృష్టి సారించింది. బలిఘట్టం ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు ఆచరించే ఘాట్లో పేరుకుపోయిన పూడికను యంత్రాలతో తొలగిస్తున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, ఇంజినీరింగ్ అధికారులు దగ్గర ఉండి ఈ పనులు చేయిస్తున్నారు. కార్తీక మాసం రోజుల్లో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పరిశుభ్రం చేయిస్తున్నారు. పూడిక తీయడంతోపాటు పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ మెరుగుపరుస్తున్నారు.

మార్మోగిన హరి నామస్మరణ



నగర సంకీర్తనలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

మాకవరపాలెం: శ్రీవారి నగర సంకీర్తన వైభవంగా సాగింది. వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం తామరంలో వేంకటేశుని నగర సంకీర్తన నిర్వహించారు. ఈ నేపథ్యంలో భక్తులతోపాటు అయ్యప్ప మాలధరించిన స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మాకవరపాలెం ఆర్టీసీ బస్టాండు నుంచి తామరంలోని ఆలయం వరకు శ్రీవారి చిత్రపటాలతో ఈ నగర సంకీర్తన చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా హాజరైన భక్తులంతా వేంకటేశుని నామస్మరణ చేయడంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రభాకరరాజు, రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

16న అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



బైక్‌లపై ప్రచారం చేస్తున్న అయ్యప్పమాలధారులు

కె.కోటపాడు: గొండుపాలెంలో జ్ఞాన ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయ 14వ వార్షికోత్సవాన్ని ఈ నెల 16న నిర్వహించనున్నట్లు గురుస్వామి బండారు వెంకట రమణమూర్తి తెలిపారు. అదే రోజు సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పడి పూజ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలో అయ్యప్పమాలధారులను ఆహ్వానించేందుకు పీఠంలో భక్తులంతా శనివారం బైక్ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో బండారు రాము, వంటాకు ఈశ్వరరావు, వెంకటరావు తదితర అయ్యప్పమాలధారులు పాల్గొన్నారు.

14న మండల సర్వ సభ్య సమావేశం

దేవరాపల్లి: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల 14న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. అన్ని శాఖల అధికారులు శాఖల వారీగా సమగ్ర సమాచారంతో సిద్ధం కావాలని సూచించారు.

పట్టణానికి దీపావళి శోభ

- దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి
- బాణసంచా సామగ్రి జోరుగా విక్రయాలు



బాణసంచా



బాణసంచా దుకాణాల వద్ద సందడి

నర్సీపట్నం: దివ్వెల పండగ దీపావళి అంటే.. జీవితం ప్రకాశమయమై ఆనందాల హరివిల్లులు కురిపిస్తే ఎలా ఉంటుందో తెలియజేసే గొప్ప పర్వదినం. ఆదివారం ఈ పండగను గ్రామగ్రామాన ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని బాణసంచా స్టాల్లు, పలు దుకాణాలు కొనుగోలుదారులతో కళకళాడుతున్నాయి. దీపావళి రాకతో కొత్తబట్టల దగ్గర నుంచి పిండి వంటలు తయారు చేసుకునేందుకు కొనుగోలు చేయడానికి వచ్చిన వారితో పట్టణంలో పండగ వాతావరణం నెలకొంది. చిచ్చుబుడ్లులు, మతాబులు, టపాసులు కొనేందుకు వచ్చిన వారితో పెద్ద చెరువు ప్రాంతం పండగ కళ సంతరించుకుంది. పిల్లాపాపలతో వచ్చి మందుగుండు సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. వెలుగు జిలుగులు జిమ్మే బాణసంచా కొనుగోలుకు ఎగబడుతున్నారు. దీపావళిని ఘనంగా జరుపుకోవడానికి ప్రజలు ఉత్సాహం చూపుతున్నారు. పండగపూట ఇంటిల్లిపాది సంతోషంగా ఉండాలని ప్రతి ఒక్కరూ దీపావళి పండగ పట్ల ఉత్సాహం చూపుతున్నారు. కొత్త బట్టలు ధరించడానికి సిద్ధమవుతున్నారు. రకరకాల పిండి వంటకాలతో ఘుమఘుమలాడించడానికి మహిళలు సిద్ధమవుతున్నారు. పిల్లల ఆనందం కోసం టపాసులు తెచ్చుకుందామని బాణసంచా దుకాణాలకు క్యూ కడుతున్నారు. దీపావళికి ఒక రోజు ముందు నుంచి ప్రతి కుటుంబంలో సందడి నెలకొంది. బాణసంచా దుకాణాల ఏర్పాటుతో పెద చెరువు ప్రాంతం వద్ద హడావిడి నెలకుంది. దీపావళికి బాణసంచా దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. దీపావళికి ముందే పట్టణంలో టపాసులు పేలుతున్నాయి.

ముందస్తు జాగ్రత్తలతో బాణసంచా పేల్చాలి: డీఎస్పీ సుబ్బరాజు

చోడవరం రూరల్: దీపావళి పర్వదినం సందర్భంగా ప్రజలు బాణసంచా పేల్చే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అనకాపల్లి డివిజన్ డిప్యూటీ పోలీస్ సూపరింటెండెంట్ వి.సుబ్బరాజు సూచించారు. శనివారం ఆయన జిల్లాలో పెద్దదైన ఫైర్‌వర్క్స్ గోదాము చోడవరంలోని శ్రీనివాస ఎలక్ట్రికల్ అండ్ ఫైర్ వర్క్స్‌ను సీఐ బి.శ్రీనివాసరావుతో కలిసి పర్యవేక్షించారు. భారీ ఎత్తున ఇక్కడి నుంచి జిల్లా నలుమూలలకు దీపావళి బాణసంచా సరఫరా అవుతోంది. ఏక కాలంలో 13 వేల టన్నుల బాణసంచా నిల్వ చేసుకునే వీలున్న ఈ గోదాంలో అగ్ని ప్రమాద నివారణకు తీసుకున్న ముందస్తు జాగ్రత్తలను, ప్రమాదం సంభవిస్తే ఎదుర్కొనేందుకు వీలుగా ఫైర్ సేఫ్టీ పనిముట్లు, నీటి సరఫరా పంపింగ్ సిస్టమ్‌లను స్వయంగా తనిఖీ చేసి, యజమాని పి.సత్యనారాయణ (సతీష్)ను ఫైర్ సేఫ్టీ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీవైఎస్పీ సుబ్బరాజు మాట్లాడుతూ ఎటువంటి ప్రమాదాలు సంభవించినా ఎదుర్కోడానికి పోలీస్, అగ్నిమాపక సిబ్బంది సంసిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. తక్షణ వైద్య చికిత్స అందించడానికి వీలుగా వైద్య ఆరోగ్య శాఖ సైతం తగు చర్యలు తీసుకుందన్నారు. ఆదివారం సెలవు రోజైనప్పటికీ తగినంత సిబ్బందిని ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తారని చెప్పారు. బాణసంచా పేల్చే సమయంలో చిన్నపిల్లలను దగ్గరకు రాకుండా చూడాలన్నారు. దగ్గరలో నీటిని సిద్ధంగా ఉంచుకోవాలని, కాల్చిన బాణసంచాను విచ్చలవిడిగా పారేయకుండా, ఒకచోట చేర్చి నీటిని పోయాలని, సిల్కు వస్త్రాలు గాకుండా, లూజుగా ఉండే కాటన్ వస్త్రాలను ధరించడం మంచిదని సూచించారు.



ఫైర్ వర్క్స్ గోదాంను తనిఖీ చేస్తున్న డీఎస్పీ సుబ్బరాజు

అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే చర్యలు

మాడుగుల: దీపావళికి అనుమతులు లేనిదే టపాసులు విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఫైర్ అధికారి వి. రాజేశ్వరరావు అన్నారు. మాడుగులలో 7 షాపులకు, ఘాట్‌రోడ్ జంక్షన్‌లో 5, ఎం. కోటపాడు, -1, కింతలి-1, ఎం. కోడూరులో -3, కింతలి -2 షాపులకు అనుమతులు ఇచ్చామన్నారు. ప్రతి షాపు వద్ద వాటర్ డ్రమ్‌తోపాటు రెండు ఇసుక బస్తాలు ఉంచాలన్నారు. షాపు యజమానులు టపాస్ షాపులు బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎల్.ఎఫ్.వో భోగేశ్వరరావు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పశు సంరక్షణ కార్డుల పంపిణీ



ఆర్లిలో రైతులకు పశు ఆరోగ్య కార్డులను అందజేస్తున్న ఏడీ బైరాగి

కె.కోటపాడు: పశు సంరక్షణ కార్డులో పశువుకు సంబంధించిన ఆరోగ్య వివరాలు నమోదు చేయనున్నట్టు పశుసంవర్ధక శాఖ ఏడీ జి.బైరాగి తెలిపారు. పశు విజ్ఞాన బడిలో భాగంగా ఆర్లిలో శనివారం రైతులకు పశు సంరక్షణలో జాగ్రత్తలను వివరించారు. పశు ఆరోగ్య కార్డుల్లో ఆవులకు, గేదెలకు కృత్రిమ గర్భోత్పత్తికి చేసిన వైద్యం వివరాలు, చూడి తనిఖీ, వ్యాధి నిరోధక టీకాలు వేసిన తేదీల వివరాలను నమోదు చేస్తామన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులకు కార్డులను ఆర్బీకేల్లో పశువైద్య సహాయకులు అందించనున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ బోళెం కృష్ణారావు పాల్గొన్నారు.



జేడీపేటలో బ్రూసెల్లో వేక్సిన్ వేస్తున్న వీఎల్‌వో సత్యం

80 దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాక్సిన్

మాడుగుల: జమ్మాదేవిపేటలో శనివారం బ్రూసెల్లోసిస్ ప్రివెంట్ వేక్సిన్ దూడలకు ముందస్తుగా వేశారు. 4 నుంచి 8 నెలల లోపు 80 ఆవు, గేదె జాతి దూడలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ లైవ్‌స్టాక్ అధికారి సీహెచ్ సత్యం మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ వేయడం వల్ల బ్రూసెల్లోసిస్ వ్యాధి కారక బ్యాక్టీరియాల నుంచి పశువులను కాపాడుకోవచ్చన్నారు. వీటి బారిన పడే పశువులు ఈనే దశలో వేసే మాయ తొక్కితే ఈ వ్యాధి సోకే అవకాశముందన్నారు. ఈ వ్యాధులున్న పశువుల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పార్వతీపరమేశ్వరులకు పట్టు వస్త్రాలు సమర్పణ

మాడుగుల రూరల్: ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవ మూర్తులకు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొల్లవిల్లి రాజేష్ శనివారం పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవారం నుంచి కార్తీక మాసం ప్రారంభం కానున్న శుభ సందర్భంగా ఆలయంలో పార్వతీ పరమేశ్వరులకు, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి నాగబంధన సర్పం విగ్రహాలకు పట్టు వస్త్రాలు సమర్పించి రాజేశ్, తన భార్య వరలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.



పార్వతీ పరమేశ్వరులకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న రాజేష్

ఆటో డ్రైవర్లతో శ్రమదానం

దేవరాపల్లి: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా దేవరాపల్లి నుంచి తెనుగుపూడి రహదారిలో ఎస్‌ఐ డి. నాగేంద్ర పర్యవేక్షణలో శనివారం ఆటో డ్రైవర్లు తుప్పలు, డొంకలు తొలగించారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఈ పనులు చేయించారు. ప్రమాదకర మలుపుల వద్ద జేసీబీ, ఎర్త్ మూవర్స్‌తో జంగిల్స్‌ను తొలగిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఆటో డ్రైవర్లను అభినందించారు.



ఎస్‌ఐ పర్యవేక్షణలో తుప్పల తొలగింపు

మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించుకుందాం

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంపై విస్తృత ప్రచారం



మాకవరపాలెం: రాచపల్లిలో పథకాలను తెలియజేస్తున్న ఎంపీపీ, నేతలు



మాడుగుల రూరల్: కె.జె.పురం-1లో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు రాజారామ్



కె.కోటపాడు: చంద్రయ్యపేటలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని తెలుపుతున్న ఎంపీపీ జగన్‌మోహన్

నర్సీపట్నం: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నింపాయని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. శనివారం నర్సీపట్నం మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి 11వ వార్డులో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకతీతంగా నాలుగున్నరేళ్లగా సీఎం సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి ఓట్లేసి మళ్లీ సీఎంగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుందామని కోరారు. ఈ వార్డులో రూ.15 కోట్లు సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను, నాయకులు బేతిరెడ్డి విజయ్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గుడివాడ సన్యాసినాయుడు పాల్గొన్నారు.



మాడుగుల రూరల్: చీడికాడ మండలం ఖండివరంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న సుంకర శ్రీనివాసరావు,

కె.కోటపాడు: ప్రజలకు మంచి చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలన్న ఆలోచనతో సీఎం జగన్ పని చేస్తున్నారని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. చంద్రయ్యపేట, కె.కె.అగ్రహారం గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రెండు గ్రామాల్లో ఇంటింటికీ పార్టీ నాయకులతో కలిసి వెళ్లిన ఆయన ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని బుక్‌లెట్‌ల రూపంలో వివరించారు. సర్పంచ్‌లు చల్లా మంగ, సబ్బవరపు పార్వతి, మండల జేసీఎస్ కన్వీనర్ ఏటుకూరి రాజేష్ పాల్గొన్నారు.

మాకవరపాలెం: ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎంను చేయాలని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా శనివారం రాచపల్లిలో ఎంపీపీతోపాటు నేతలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, నాలుగున్నరేళ్లపాటు చేపట్టిన అభివృద్ధిని తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాజారావు, సచివాలయ మండల కన్వీనర్ చిటికెల రమణ, జిల్లా కార్యదర్శి బొద్దు గోవిందరావు, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, మాజీ సర్పంచ్‌లు పెట్ల భద్రాచలం, దొరబాబు, జె.కె.రాజు పాల్గొన్నారు.

గొలుగొండ: ఇచ్చిన ప్రతీ హామీ నెరవేర్చడంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలు పూర్తి నమ్మకం కలిగి ఉన్నారని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం ఎర్రవరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ప్రతీ ఇంటికి వెళ్లి జగన్ నెరవేర్చిన హామీలు, చంద్రబాబు మోసాలు గురించి వివరించారు. మండల సచివాలయ కన్వీనర్ కొరుప్రోలు పాణీశాంతారామ్, సర్పంచ్ పట్నాల వరలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నర్సీపట్నం: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



గొలుగొండ: ఎర్రవరంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మాడుగుల రూరల్: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా కె.జె.పురం- 1వలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర అనంతరం పార్టీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ తదితరులు శనివారం ఇంటింటికీ తిరిగి సంక్షేమ లబ్ధిని వివరించారు. నాలుగున్నరేళ్లలో రూ.20 కోట్ల మేర సంక్షేమ, అభివృద్ధికి ప్రభుత్వం వెచ్చించిందన్నారు. మరలా రెండో సారి సీఎంగా జగన్‌ను మూడో సారి ఎమ్మెల్యేగా బూడి ముత్యాలనాయుడును గెలిపించుకోవాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ శానాపతి కొండలరావు, పార్టీ సీనియర్ నాయకుడు కొట్ని శ్రీరామూర్తి, సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, నాయకులు కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, ఎం.వి. సత్యనారాయణ, భీశెట్టి జగ్గప్పారావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులు, ఆడారి శంకరరావు, కచ్చా మోదినాయుడు, మాటూరి అప్పారావు, పరిమి బాబ్జి పాల్గొన్నారు.

చీడికాడలో....

చీడికాడ మండలం ఖండివరంలో శనివారం ఉదయం పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సుంకర శ్రీనివాసరావు ఇంటింటికీ తిరిగి నాలుగున్నరేళ్లలో గ్రామానికి రూ.27 కోట్ల మేర సంక్షేమ, అభివృద్ధికి కేటాయించిందన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, పార్టీ నాయకుడు కురచా నారాయణమూర్తి, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎం. సన్నిబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ సూర్యనారాయణ, విశాఖ డెయిరీ డైరెక్టరు శీరంరెడ్డి సూర్యనారాయణ, ఎంపీటీసీ గెంజి స్వాతి, బాలాజీ, గ్రామ సచివాలయ కన్వీనర్ సుంకర వెంకట్రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు సుంకర కొండబాబు, మాజీ సర్పంచ్ సింగంపల్లి ముత్యాలునాయుడు, నీటి సంఘం డైరెక్టరు వేచలపు కన్నబాబు, మోసూరి స్వామి పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పొందిన విద్యార్థినులతో ట్రస్టు నిర్వాహకుడు అల్లాడ సురేష్

నర్సీపట్నం: స్థానిక బీసీ హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థినులకు అల్లాడ చారిటబుల్ ట్రస్ట్ తరఫున శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకుడు అల్లాడ సురేష్ మాట్లాడుతూ ఏటా ప్రభుత్వ స్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్నామన్నారు. ఈ సారి వసతి గృహం విద్యార్థినులకు అందజేశామన్నారు. బాగా చదువుకుని ప్రయోజకులై తనలాగే పది మందికి సహాయపడాలని సూచించారు. వార్డెన్ డి.వి.రాజ్యలక్ష్మి, చక్రవర్తి, కాశీప్రసాద్, రామలింగేశ్వర శర్మ, శ్రీనివాస్, రాజా, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాలల దినోత్సవం



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో తాడి అమృత్‌కుమార్



చిన్నారుల నృత్య ప్రదర్శన

నాతవరం: ప్రభుత్వం చేసే కార్యక్రమాలతోపాటు స్వచ్ఛంద సంస్థలు విద్య రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం శుభపరిణామమని ఎంఈవో తాడి అమృత్‌కుమార్ అన్నారు. హెల్పింగ్ హార్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక యూపీ స్కూల్‌లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పండగ వాతావరణం తలపించేలా ఈ వేడుకలు జరిగాయి. చిన్నారులు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా లేని విధంగా మండలంలో నాలుగేళ్లుగా పేద విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్ స్వచ్ఛంద సంస్థ, శాంతిబ్బాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యతోపాటు అనేక సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు. హెల్పింగ్ హార్ట్ సంస్థ కృషితో 20 పైగా పాఠశాలల్లో పేద విద్యార్థులకు విద్యనందిస్తున్నామని ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జి. సీతామహలక్ష్మి తెలిపారు. అనంతరం ఆటపాటల్లో విజేతలకు ప్రోత్సాహకాలు అందించారు. ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు చిన్నారులకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు, హెల్పింగ్ హార్ట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు కె.త్రిమూర్తులు, కార్యదర్శి హరి శాంతిబ్బాయి, పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులు

నర్సీపట్నం:అల్లూరి యువ జన గిరిజన సేవా సంఘ, హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ రాజు, విశ్రాంత ప్రిన్సిపాల్ కుమార్‌బాబు ప్రారంభించారు. రక్తదానం మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు టి.మల్లేష్ మాట్లాడుతూ తమ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. 35 మంది స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేశారు. అనంతరం వంద మంది నిరుపేదలకు అన్నదానం చేశారు. డాక్టర్ జి.వి.రాజు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించండి



ప్లాస్టిక్ చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్

దేవరాపల్లి: పారిశుధ్యం మెరుగుపరిచేందుకు గ్రామస్తులు సహకరించాలని జెడ్పీటీసీ కర్రి సత్యం కోరారు. మామిడిపల్లిలో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటికి రెండు చొప్పున సరఫరా చేసిన ప్లాస్టిక్ చెత్త బుట్టలను సర్పంచ్ కర్రి సూరినాయుడుతో కలిసి శనివారం ఆయన పంపిణీ చేశారు. ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ చల్లా సుధాకర్, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.